డా.ఎ.ఎస్.రామశాస్త్రిగారు 'అనామకుడు' కలం పేరుతో తెలుగు పాఠకులకు చిరపరిచితులే. దేశ, విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించి, 35 సంవత్సరాలపాటు రిజర్వ్‌బాంక్‌లో ఉన్నతోద్యోగిగా పనిచేసిన రామశర్మగారు ప్రస్తుతం హైదరాబాదులోని IRBT డైరెక్టర్ గా పనిచేస్తున్నారు. 'అనామకుడు' కలం పేరుతో అనేక కథలు, నవలికలు, శ్రవ్యనాటికలు రచించారు. ఉషశ్రీగారి జీవితకథను "ఇంతింతై వటుడింతై' అనే పేరుతో అక్షరీకరించారు. వారు వ్రాసిన ఈ అక్షరాంజలి పద్యసంపుటి ఒక వినూత్న ప్రయోగం. మొదటి అధ్యాయం అక్షరాంజలిలో ఈ పుస్తకం రచన వెనుకనున్న ఉద్దేశాని ఇలా చెప్పారు రచయిత "అరవై సంవత్సరాలుగా ఈ సృష్టి నన్ను అనుక్షణం అబ్బురపరుస్తూనే ఉంది. ఆనందంలో ముంచెత్తుతూనే ఉంది.... (శాస్త్రవేత్తలు, శాస్త్ర విజ్ఞానం వింతగా తోస్తూనే ఉంది). సృష్టికర్త ప్రేరణతోనే సృష్టిలో నేను చూస్తున్న విశేషాలనీ, వింతలనీ సృష్టికర్తకు విన్నవించుకునే ప్రయత్నం మొదలుపెట్టాను. ఆ ప్రయత్న ఫలితమే అరవై పద్యాల అక్షరాంజలి.". ఇది చాలా చక్కటి ఆలోచన. ఈ సృష్టికంతటకీ ఏదో అతీతశక్తి కారణమని నమ్మేవారు, ఆ శక్తిని కీర్తిస్తూనో, ప్రార్థిస్తూనో పద్యాలు, శ్లోకాలు వ్రాయడం అనాదిగా వస్తున్న ప్రక్రియే. ఐనా ఈ రచయిత చేసిన ఈ నివేదనలో ఒక విలక్షణత ఉంది. సనాతన విజ్ఞానం, ఉపనిషత్తుల నుంచి ఆధునిక విజ్ఞానశాస్త్రంలోని అనేక శాఖలవరకూ వివిధ అంశాలను తాను చూసిన విధానాన్నీ, వాటిలోని సందేహాలనూ సృష్టికర్త ఎదుట ఆవిష్కరించుకునే ప్రయత్నమే ఈ పద్యపారిజాతాల కూర్పు. ఇందులోని అంశాలన్నింటినీ ఆత్మనివేదన, నీ వినోదం, మా సందేహం, నీ విలాసం, ఉపనిషత్తులు, సనాతన విజ్ఞానం, నా విన్నపం అనే అధ్యాయాలుగా విభజించి వ్రాశారు. పుస్తకం చివరలో ఈ పద్యాల్లోని కొన్నికొన్ని సైంటిఫిక్ పదాలకు, లోతైన భావాలకు ఆంగ్లంలో వివరణనిచ్చారు. పద్య రచన అత్యంత సరళంగా సాగింది. గంభీరసమాసాలతో నింపెయ్యకుండా అందరికీ అర్థమయ్యే రీతిలో, అందరినీ ఆసక్తిగా చదివించే శైలీలో సాగాయి పద్యాలన్నీ. పద్యరచనలో ఒక చక్కటి లయ గోచరిస్తుంది. చాలా పద్యాలలో కరుణశ్రీగారి పద్యరచనా పోకడలు స్ఫురిస్తాయి. ఉదాహరణకు: ఆత్మనివేదనలో " ఇచ్చితీవు భోజ్యములు - ఇచ్చితి నీకు నివేదనంబుగా / ఇచ్చితీవు పుష్పములు - ఇచ్చితి నీకు సుమమాలగా / ఇచ్చితీవు విద్యలను - ఇచ్చుచునుంటిని పద్యమట్లుగా / ఇచ్చిన నీకే ఇచ్చుటను - ఎంచక తప్పుగ స్వీకరించుమా!" 'ఇచ్చిన నీకే ఇచ్చుట' ఎంత చక్కని భావన..! మా సందేహంలో ఇలా అంటారు - "తారల మధ్యదూరము, పదార్థపు రీతులు, దేహభాగముల్ / తీరుల చూచి సత్యమును తేల్చగనెంచెడు ఊహ సవ్యమా? - మారుచునుండు లోకమొక మాయయె - సత్యము అంతరంగపున్ / దారుల యోగసాధనము ధ్యానము చేసిన కాని చిక్కదా?". ప్రతి పద్యంలోనూ లోతైన భావాలున్నాయి, వాటికి అందమైన పద్యరూపమిచ్చిన 'అనామకుడు' గారి కృషిని అభినందించాలి. ఈ చిరుపుస్తకం అమ్మకానికి కాదు. ఉచితంగా ఇక్కడ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. asramasastri.com/books/aksharanjali.pdf ★★★




**Published by**
Aparajitha Publications
Flat 401, Block 3
MyHome Vihanga
Gachibowli
Hyderabad - 500032
INDIA

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI (Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**